కవితా కౌముది

# దిగులుపేజీ

వారాల ఆనంద్

దిగులు కదలాడుతుంది
బొంగరంలా గిరగిరా తిరుగుతుంది
కళ్ళల్లో జీరలా కనిపించి గుండెల్లోకి దిగుతుంది
మంచు గడ్డలా కరిగి
పాదరసంలా దేహమంతా వ్యాపిస్తుంది

దిగులు జీర్ణం కాదు రక్త నాళా ల్లోకి ఇంకి
కదుల్తూ జారుతూ నిలవదు నిలవనీయదు

చేతన అచేతనమవుతుంది

పగలేమో వెళ్తురు ఊడలతో
వేలాడుతూ కాలం వెళ్లదీయొచ్చు
.. . . . . .
చిత్రం
సూర్యుడు దిగిపోయాకే
దిగులు సామ్రాజ్యం విస్తరిస్తుంది

అప్పటిదాకా కాళ్ళరిగేలా
అటూ ఇటూ తిరిగిన గాలి
ఇంటిముందు అరుగు మీద
కూర్చుండి పోతుంది

దిగులును ఉద్దీపన చేస్తూ
ఆకాశంలోంచి చీకటి
ఒక్కో బొట్టూ నాలోకి చేరుతుంది

శూన్యం అణువణువునూ
దుప్పటిలా కప్పే స్తుంది

ఏంచేయను
రాత్రి కూడా నిద్దరోతుంది

నేనేమో
నిద్రా మెలకువా కాని స్థితిలో
. . . . . .
భూమి బద్దలయినట్టు
దుఖం బద్దలయితే బాగుండు
దిగులు పలుచనయి ఆవిరయి ఎగిరి పోను
నేనేమో దిగులు పేజీని తిప్పేసి
మేల్కొని పోదు

***



# శీతాకాండ

భాస్కర్ కొంపెల్ల

ఆకాశవేదిక మీద వతనుగా
ఎక్స్ట్రా వేషం వేసే సూరీడూ,

రిబ్బన్లాంటి రోడ్డుపై అడ్డగీతలతో
కలంకారీ అద్దే చెట్లనీడలూ,

వైభవం కోల్పోయిన నాయకీనాయకుల్లా
వసంతంకోసం పైకి చూసే చెట్లమోడులూ,

పరాయివాళ్ళకి ఆప్యాయంగా కనిపించే
అత్తగారి మనసులా ధగధగమనే ఎండా,

మనపళ్ళని మనచేతే మనమీదే నూరించే
కర్కశముష్కరుళ్ళా కొరకొరమనే చలీ,

ఏనుగుకి భయపడి ఏతెంచాలా?
గాడిదకి ఒడబడి గదిలో మూల్గాలా?
అనే సందిగ్ధంలో మంచూ…

నాటకం మొదలైందో లేదో తెలియక
నటులు తెరవెనక కలవరపడుతున్నారు.

మంచుమనిషిని చెయ్యాలని ఆశతో
పిల్లలు కిటికీల్లో తచ్చాడుతున్నారు.

***



# ఏం నేర్చాం

ఉమా మహేష్ ఆచాళ్ళ

పోరాడని ప్రాణం
మారని ఓ నాణెం
ఉన్నా లేకున్నా,
మూల్యం ఓ సున్నా

అడుగైనా లేని ఉడత
జడివానకి జడిసేనా
గుడిచుట్టూ తిరిగేనా
దేవుడికే సాయపడలేదా

అంబరాన పావురాయి
ఉరుమొస్తే ఆగిందా
ఎదురు బాగోలేదంటూ
ఎగరడమాపిందా

విసిరేసిన విత్తుగింజ
ఉసూరంటూ మెత్తబడెనా
నరనరమున సత్తువుంచి
ధరణి పొరలు చీల్చలేదా
పైరు చిగురు తొడగలేదా

సునామీ రానుందని
మీనమొడ్డుకొచ్చిందా
కనిపెంచిన సాగరాన్ని
కలనైనా వీడిందా

దావాలన మొస్తుందని
'జూ' కోరదు వన్యజీవి
చావైనా రేవైనా
వనమే తన ఊపిరిగా

తన చుట్టూ ఇన్ని జతల
ఘనత చాట మూగజాతి
అదనంగా తెలివుండీ,
చిన్న చిన్న కలతలకే
మనిషెందుకు మతితప్పే
ఏంనేర్చెను వేటతప్ప!

జంతువు తన గురువేంటని
పంతానికి పోయినాడు
చింతల చితిలోవాడు
నిత్యం తగలడినాడు

***



# ఒంటరి ఇండియా పక్షులు

రామానుజరావు

గూడు వద్దని పావురాలు
దూర తీరాలకు వలస పోతాయి.
పిచ్చుకలు
ముక్కున కరచిన భ్రమలకు,
నిలువుటద్దం
బీటలు వారుతుంది.
తాత పంచిన
ఉప్పు మూట ఆనందాలు
పసిఫిక్ సముద్రంలో జారి,
బొక్కులలో చేరి,
ఆఖరి చూపుకై వేచి చూస్తాయి.
అమ్మ నిట్టూర్పుల
కలం రాయని సీరియల్ కథకు,
జవాబు తెచ్చే పోస్టుమాన్ వుండడు.
నాన్నను పిండిన ఆశల బరువు,
డాలరు త్రాసులో
తేలి పోతుంది.
రాత్రి పగలు మార్చుకుని,పేర్చుకుని
రబ్బరు బ్యాండులా సాగుతూ
ఊరికొక గంట మార్చే,
ఊసరవెల్లి సెల్ఫోను మాట విని

తాతలనాటి గోడ గడియారం
మూగబోతుంది.
అక్కరకు అందని సహాయత
అవసరాలు పండి జ్ఞాపకాలై రాలిపడి,
విహారాలు వీలు చేసుకుని
చక్రాల కాళ్ళు చిగురిస్తాయి
అంతర్జాల మొక అంటురోగమై,
ఉగాదుల ఉషస్సులు,
దీపావళి తేజస్సులు,
పుట్టిన రోజు ఆశ్శీసులు,
బొమ్మలన్నీ
తెరపైనే తేలుతుంటాయి.
అసంపూర్ణ కథలన్నీ
మళ్ళీ మళ్ళీ అ, ఆ లు దిద్దుతూ,
అసంకల్పిత కలలవుతాయి
మొన్న మొలకలేసిన ఊహలన్నీ,
నీళ్ళు ఇంకిన కళ్ళ ముందు
నుసుమలై తిరుగాడుతాయి
ఫ్రేములు విరిగి కళ్ళజోళ్ళు
దారం కట్లు వేసుకుంటాయి

★★★



## గొర్లమంద

### కృష్ణమణి

నేనే పరాన్నజీవిని
పరాన్నబక్కు అని కూడా అంటారు
ఏదైతే ఏందిరాభై
మంది మీద బతుకుడే గదా
మనమందరమూ సోదరా
అవును భై - పక్కోల్లది గుంజకు తింటేగని నిద్రబట్టదు
అయితేంది ? -అట్లా కాదుగని
ఒక్కసారి ఆలోచించు
సృష్టిలో జీవులన్నీ పరాన్నజీవులు కాకుంటే ఏం జరిగేదో
ఏమయితుండేభై
సముద్రంలో చేపలు నిండి , నీళ్లన్నీ పైకొచ్చి జమీనుని ముంచి
ఈ భూగోళం ఒక వింత ఆకృతితో పంది మసలినట్లు ఉండేది!
మనిషి ఎంతకాలమని నీటిమీద బతుకుతడు
ఎన్నడో ఖతంయ్యేటోడు
లేకుంటే ఇప్పటికి గుడ్డబట్ట కానక
కోతికి తాతయ్యేటోడు
నిజమే భై అట్లానన్నా కాకపాయే
ఇగి కాపురం సల్లగుండా
గుండెలల్ల ఈ అగ్గిగోళాలు బగ్గుమని పొగలు జిమ్ముడు ఉండేవా ?
రంగుల గుద్దులాటలుండేవా ?
నా కులమనీ , నా భాష అనీ , నా సంస్కృతి అనీ
జబ్బలు సరసుడు ఉండేదా ?
ఈ ఓర్వజాలని గుణాలు
పెద్దకూర పంచాదులు ఉండేవా ?
ఆడమగ తేడాలు , కట్నం సావులు
కనికరం లేని కసాయిల షికారులు ఉండేవా ?
మతం గొప్పలు , పీఠం తిప్పలు , తేరని అప్పులు
ఈ దగ్గులు తుమ్ములు
దావఖాన జబ్బులు ఉండేవా ?
మతమంటే అనిపిస్తుంది
కనీసం మనిషికి మతం పిచ్చన్న లేకున్నా
అసలు మతమనేది లేకున్నా చరిత్ర ఎట్లుండేదో ?
జీవులు పరాన్నబక్కులైనా ఏమిగాలేదు కాని
మనిషికి అహంకారమనే విషాన్ని చిమ్మకున్నా బాగుండేది !!
చలో భై సాబ్ .. యాదిజేసి మనసుకాలవెట్టినవు
చాయి తాపియ్యి నడువు ★★★

## అనుంది

### కళ్యాణదుర్గం స్వర్ణలత

ఎటు చూసినా..
కంటికి గుత్తులు గుత్తులుగా
పూస్తున్న అశ్రువులు,
అపహాస్యాల , అసహ్యాల జ్వాలలో
ఆహుతైన ఆత్మలు
కొలతలను చేరలేక భంగ పడ్డ ఆశలు
శిథిలమౌతున్న మూలాల్లో
మగ్గుతున్న బంధాలు
వేకువ కూడ
వెలుగునివ్వలేని వేదనలు
అన్నింటి మధ్య ..
ఒక్కసారి ఒకే ఒక్కసారి
నిటారుగా నిలవాలనుంది!
అవనతమౌతున్న ఆత్మలను మళ్ళీ ఎగిరేయాలనుంది !
బలంగ స్వచ్ఛంగ ఒక్కసారి ఉక్కులాంటి ఒక్కమాట పలకాలనుంది
'నేనున్నానని '!!!

****



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి


చలువ వెన్నెల రేడు నీ చెలిమి కోరె
చెలియయ్యై తొగకన్నె నా చెంత చేరె
నిండునెలనైతినెన్నొ పున్నెములు పండి
కలువవై విరిసితివి నా కనులు నిండి

కలత చెందితి కాలమ్ము కరుగునంచు
కదలి ముందుకు సాగదీ కలువ చెంత
పయనమాపెను కాలమ్ము, వయసు, మనసు
నేల నింగి సర్వమ్ము ఘనీభవించె

కాలమంతయు నిలిచెనీ క్షణమునందు
జన్మలన్నియు నిలిచెనీ జన్మమందు
జీవితము శాశ్వతమ్మయ్యె చెలియ చెంత
లిప్తలోనమరత్వ సుప్రాప్తి కలిగె

ఒక్క ఘడియ చాలును, చాలునొక్క త్రుటియె
రాగమేఘంపు తేరుపై సాగుటకును
ఒక్కనాడైన రససిద్ధినొందకుండ
ఎన్ని యుగములు బ్రతికిననేమి ఫలము?

చెలిమి నీడను తన్మయస్థితిని పొంది
పలుకనేరని యానందపథమునంది
పరిసరమ్ముల మరచి సర్వమ్ము విడచి
గడపు క్షణమైన చాలు యుగమ్ము లేల?



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS